

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 02-12-2025 సంపుటి : 07 సంచిక 205 పేజీలు : 8 వెల: రూ 3-00



# పార్లమెంట్‌లో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 01 : బిహార్ ఓటమి నుంచి ఇంకా బయటకు రాలేదంటూ ప్రతిపక్షాలకు ప్రధాని నరేంద్ర మోదీ చురకలంటించారు. ఓటమి బాధ నుంచి బయటకు రావాలంటూ ఇండి కూటమిలోని భాగస్వామ్య పక్షాలకు ఆయన సూచించారు. మీ బాధ్యతను మీరు నిర్వర్తించండంటూ ఆయా పార్టీలకు ప్రధాని హితవు పలికారు. పార్లమెంటులో బలమైన అంశాలతోపాటు ప్రశ్నలు లేవనెత్తండంటూ వారికి కీలక సూచన చేశారు.పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సోమవారం అంటే ఈ రోజు నుంచి ప్రారంభమవుతు న్నాయి. ఈ సమావేశాలకు ముందు సభ్యులను ఉద్దేశించి పార్లమెంట్ ఎదుట ప్రధాని మోదీ ప్రసంగించారు. వికసిత్ భారత్ లక్ష్యంగా తాము ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు. తమ ప్రధాన లక్ష్యం దేశాభివృద్ధి మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య దేశంలో అందరి అభిప్రాయాలు తెలుసుకోవాలన్నారు. చట్టసభల్లో సమయానుకూలంగా చర్చలు తప్పనిసరి అని వివరించారు. అన్ని అంశాలపై సానుకూల చర్చలు జరుగుతాయని తాను ఆశిస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు.సోమవారం ఉదయం 11 గంటలకు ఈ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. ఇవి ఈనెల 19వ తేదీ వరకు కొనసాగుతాయి. సెలవు రోజులు మినహా మొత్తం 15 రోజులపాటు ఈ శీతాకాల సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులు ఆమోదం పొందనున్నాయి.ఈ సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరించాలని విపక్షాలను కేంద్రం కోరింది. ఆదివారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షతన న్యూఢిల్లీలో అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ భేటీ అనంతరం పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజుమాట్లాడుతూ..పార్లమెంట్‌సజావుగాసాగేందుకు సహకరించాలని, ఆటంకాలు సృష్టించ వద్దని విపక్షాలను కోరామన్నారు. దాదాపు గంటన్నర పాటు ఈ అఖిలపక్ష భేటీ జరిగింది. ఈ భేటీలో విపక్షాల డిమాండ్లు విన్నారేగానీ ఏమాత్రం స్పందించలేదని కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఉపనేత గౌరవ్ గొగోయ్ మండిపడ్డారు.ఈ అఖిల పక్ష సమావేశానికి కేంద్ర మంత్రులు కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, అర్జున్‌రామ్ మేఘవాల్, ఎల్.మురుగన్, అనుప్రియ పటేల్‌తోపాటు జైరామ్ రమేశ్ (కాంగ్రెస్), లావు శ్రీకృష్ణ దేవరాయలు (టీడీపీ), మిథున్‌రెడ్డి (వైసీపీ), సురేశ్‌రెడ్డి (బీఆర్ఎస్), 50మంది నేతలు పాల్గొన్నారు. కృష్ణా జలాల వినియోగం, కేటాయింపులపై పార్లమెంట్‌లో చర్చించాలని టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రాల మధ్య నదీ జలాల అంశాన్ని పరిష్కరించాలని కేంద్రాన్ని కోరినట్లు బీఆర్ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్ తెలిపారు.

# ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం



అమరావతి, డిసెంబరు1 : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఏపీ సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోకి ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగ సంఘాలను, ఎన్ఎంయూఏ, ఎంప్లాయిస్ యూనియన్లను చేర్చింది రాష్ట్ర ప్రభుత్వం. రెండు ప్రధాన సంఘాలకు ఉద్యోగుల జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో సభ్యత్వం మంజూరు చేసింది. సభ్యత్వం మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది ప్రభుత్వం. ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు జీఏడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ ఎస్ రావత్. సభ్యత్వం రావడంతో ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు సత్వరమే పరిష్కారమయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగ సంఘాలతో జరిపే చర్చల్లో ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు పాల్గొనే సదుపాయం కల్పించింది.ఉద్యోగుల సర్వీసు రూల్స్, పదోన్నతులు తదితర సమస్యలను నేరుగా ప్రభుత్వానికి తెలియజేసే అవకాశం ఉంది.

# రీఓపెన్ కేసులను త్వరితగతిన పరిష్కరించండి

## పిజిఆర్ఎస్ లో 278 అర్జీలు: జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణియా

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబరు 01:ప్రజా పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను వేగవంతంగా, నాణ్యతతో పరిష్కరించాలని సంబంధిత శాఖలకు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో పిజిఆర్ఎస్ హాలులో ఫిర్యాదులు స్వీకరించిన అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.కలెక్టర్ మాట్లాడుతూ ? ఆడిట్‌లో మొత్తం 1694 కేసులు పెండింగ్‌గా ఉన్నాయని, అందులో పంచాయతీరాజ్ 364, విద్యుత్ 114, పోలీసులు 95, మైనారిటీ సంక్షేమం 43, హౌసింగ్ 39, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ 36, సర్వే 26, ఆర్డబ్ల్యూఎస్ 26 కేసులు తక్షణం క్లియర్ చేయాలని ఆదేశించారు.రీఓపెన్ కేసులు 494 ఉండగా, ఆత్మకూరు ఆర్డీఓ వద్ద 77, డోన్ వద్ద 77, నంద్యాల వద్ద 70 పెండింగ్‌లో ఉన్నాయని, వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు.పిజిఆర్ఎస్ ద్వారా వచ్చిన ముఖ్య అర్జీలు:గడివేముల ? పవర్‌గ్రిడ్ హైటెన్షన్ తీగలతో భూవిలువ తగ్గిందని రైతుల ఫిర్యాదు. కోవెలకుంట్ల ? వికలాంగుడైన మద్దిలేటికి విద్యుత్ ట్రై సైకిల్ మంజూరు చేయాలని విజ్ఞప్తి. శ్రీశైలం ? నీటిముంపు కారణంగా పునరావాస ఉద్యోగావకాశం ఇవ్వాలంటూ హరిప్రసాద్ రెడ్డి అర్జీ.సోమవారం మొత్తం 278 మంది తమ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు సమర్పించగా, అన్ని అర్జీలను నిర్ణీత గడువులో పూర్తిచేయాలని సంబంధిత శాఖలకు కలెక్టర్ స్పష్టం చేశారు.



# దిత్వా తుఫాన్ ఎఫెక్ట్.. ఏపీలో భారీ వర్షాలు



విశాఖపట్నం, డిసెంబరు1 : దిత్వా తుఫాన్ బలహీనపడి.. ప్రస్తుతం తీవ్ర వాయుగుండంగా కొనసాగుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వాహణ సంస్థ అధికారులు తెలిపారు. తుఫాను మరింతగా బలహనపడి వాయుగుండంగా మారుతోందని వెల్లడించారు. ఇది ప్రస్తుతం నైరుతీ, పశ్చిమ మధ్య బంగాళాఖాతాలను ఆనుకుని కొనసాగుతోందని వివరించారు. ఈ వాయగుండం చైన్నై తీరానికి దగ్గరగా.. ఉత్తర దిశగా పయనిస్తోందని తెలిపారు. తుఫాను గంటకు ఐదు కిలోమీటర్ల వేగంతో కదులుతోందని చెప్పుకొచ్చారు. తుఫాను ప్రభావంతో రేపు (మంగళవారం) ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. తీరం వెంబడి బలమైన గాలులు వీస్తాయని తెలిపారు. మత్స్యకారులు వేటకు వెళ్లకూడదని సూచించారు. దిత్వా తుఫాను ప్రభావం దృష్ట్యా ప్రజలు సరైన జాగ్రత్తలు పాటించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వాహణ సంస్థ అధికారులు దిశానిర్దేశం చేశారు.దిత్వా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారని ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. సముద్ర తీర ప్రాంత జిల్లాల్లో విద్యుత్ సిబ్బందిఎప్పటికప్పుడుచర్యలు చేపడుతున్నారని వివరించారు. ఎలాంటి ఇబ్బంది వచ్చినఆదుకునేందుకువిద్యుత్‌సిబ్బందిసిద్ధంగాఉన్నారని చెప్పుకొచ్చారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటించారు. పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మంత్రి గొట్టిపాటి మాట్లాడారు.

# పదవ తరగతిలో మంచి ఉత్తీర్ణతతో పాస్ కావాలి

## <u>గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత.జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి</u>

కర్నూలు, డిసెంబర్ 01:-పదవ తరగతి లో మంచి ఉత్తీర్ణతతో పాస్ కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి విద్యార్థులతో మాట్లాడుతూ కోరారు.సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయం సునయన ఆడిటోరియంలో పి జి ఆర్ ఎస్ లో గిరిజన సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పదవ తరగతి స్టడీ మెటీరియల్ ను జిల్లా కలెక్టర్ అధ్యక్షతన విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలోని కర్నూలు, ఆలూరు, రాతన గ్రామాల గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మొత్తం 64 మంది పదవ తరగతి విద్యార్థులు చదువుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా గిరిజన సంక్షేమ శాఖ అందించిన ఈ స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని, ప్రభుత్వం అందిస్తున్న విద్యా అవకాశాలు, సౌకర్యాలను పూర్తిగా ఉపయోగించుకొని చదువులో రాణించాలని పిలుపునిచ్చారు. ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగి, భవిష్యత్తులో మంచి స్థానాలను సాధించాలని కలెక్టర్ విద్యార్థులను ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, గిరిజన సంక్షేమ శాఖ అధికారి సురేష్ , ప్రధాన ఉపాధ్యాయుడు శివ కృష్ణ, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.






# సంపాదకీయం

మంగళవారం 02-12-2025

## ప్రైవేట్ రంగంలో న్యూక్లియర్ ఎనర్జీ..

న్యూక్లియర్ ఎనర్జీ.. వినియోగించే తీరుపై దీని పవర్ ఆధారపడి ఉంటుంది. విధ్వంసానికి వాడితే ప్రపంచం నాశనం అవుతుంది. సద్వినియోగం చేసుకుంటే అనేక దేశాలు అభివృద్ధి చెందుతాయి. యురేనియంతో ఉత్పత్తి చేసే పవర్‌తో విద్యుత్ ధరలు చాలా వరకు తగ్గుతాయి. ఈ క్రమంలో ప్రధాని మోదీ ఇటీవల ప్రైవేటు సంస్థలుకు న్యూక్లియర్ విద్యుత్ ఉత్పత్తిలో భాగస్వామ్యం అందించే నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం 8?10 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న భారత్ రాబోయే కాలంలో 100 గిగావాట్ల ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇది విద్యుత్ బిల్లులు 5,000 నుంచి 500 రూపాయల వరకు తగ్గే అవకాశాన్ని కలిగిస్తుంది. ప్రపంచంలో న్యూక్లియర్ విద్యుత్ ఉత్పత్తిలో చైనా మొదటి, అమెరికా రెండో స్థానంలో ఉండగా, భారత్ మూడో స్థానంలో నిలిచింది. యురేనియం సమృద్ధితో, భారత్ ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో ఈ శక్తిని మరింత విశాలపరిచే అవకాశాలు ఉన్నాయి. అమెరికా, కెనడా వంటి దేశాల సంస్థలు భారత్‌లో పెట్టుబడులు పెడితే స్థాయి మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. ప్రైవేటీకరణతో న్యూక్లియర్ ఉత్పత్తి పెరిగితే విద్యుత్ తీవ్రంగా సరఫరా అవ్వడం వల్ల పాకిస్తాన్ కు భయాందోళనలు ఏర్పడతాయని నిపుణులు భావిస్తున్నారు. అణు విద్యుత్తుకు అవసరమైన యురేనియం ను తవ్వడానికి, దిగుమతి చేసుకోవడానికి, ప్రాసెస్ చేయడానికి ప్రైవేట్ సంస్థలను అనుమతించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. 2047 నాటికి అణు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 12 రెట్లు పెంచాలని యోచిస్తోంది. అలా జరిగితే భారతదేశ మొత్తం విద్యుత్ అవసరాలలో 5% అణు విద్యుత్తు ద్వారా తీరుతుంది. అణు విద్యుత్ ప్లాంట్లకు అవసరమైన నియంత్రణ వ్యవస్థ పరికరాలను సరఫరా చేయడానికి ప్రైవేట్ సంస్థలకు అవకాశం కల్పిస్తారట. ప్రభుత్వ డేటా ప్రకారం.. భారతదేశంలో 76, 000 టన్నుల యురేనియం ఉందని అంచనా. ఇది 30 సంవత్సరాల పాటు 10,000 మెగావాట్ల అణు విద్యుత్తుకు ఇంధనంగా సరిపోతుంది. ఈ నేపథ్యంలో భారతదేశం తన ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని పెంచుకోవాల్సి ఉంటుంది. ఇంధన విషయంలో దేశం ఎంతో ప్రగతి సాధించాలి. సోలార్, గ్రీన్ హైడ్రోజన్ వైపు నడవాల్సి ఉంది. అణు ఇంధనంపై కూడా దృష్టి సారించి వేగంగా అడుగులు వేయాలి. అణు విద్యుత్తులో ప్రైవేట్ పెట్టుబడులను ఆహ్వానిస్తాం. పెట్రోల్, డీజిల్ దిగుమతుల కోసం లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాం. కొత్త ఇంధనాల సహాయంతో దిగుమతులను తగ్గించుకోవచ్చు. ఆ దిగుమతులు తగ్గితే స్వయం సమృద్ధి సాధ్యమవుతుంది. నేడు ప్రపంచమంతా ఖనిజాల గురించే ఆలోచిస్తోంది' అని తాజాగా ప్రధాని వ్యాఖ్యానించారు. బడ్జెట్‌లో ఎక్కువ భాగం ఇప్పటికీ పెట్రోల్, డీజిల్, గ్యాస్ దిగుమతి చేసుకోవడానికే పోతున్నాయని ప్రధాని మోదీ అన్నారు. సౌర, హైడ్రోజన్, జల, అణుశక్తిలో ప్రధాన విస్తరణలతో పాటు సముద్ర వనరులను ఉపయోగించుకునేందుకు నేషనల్ డీప్ వాటర్ ఎక్స్‌ప్లోరేషన్ మిషన్‌నూ ప్రారంభించనట్లు ఆయన ప్రకటించారు. భారత్‌లో అణు విద్యుత్, ఇతర న్యూక్లియర్ పరిశోధనలు పూర్తిగా ప్రభుత్వరంగంలోనే కొనసాగుతున్నాయి. 'అటామిక్ ఎనర్జీ యాక్ట్ -1962' ద్వారా ఈ రంగంలో ప్రైవేటు సంస్థల భాగస్వామ్యాన్ని పూర్తిగా నిషేధించారు. ఈ చట్టం స్థానంలో మోదీ సర్కారు కొత్త చట్టం తీసుకొచ్చి ప్రైవేటు రంగానికి అవకాశం కల్పించాలని నిర్ణయించింది. అందుకోసం డిసెంబర్ 1 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో 'ది అటామిక్ ఎనర్జీ బిల్-2025'ను ప్రవేశపెట్టబోతోంది. అణు విద్యుత్ విభాగంలో ప్రైవేటు రంగానికి అవకాశం కల్పించేలా 2025-26 వార్షిక బడ్జెట్‌లోనే నిర్ణయం తీసుకున్నట్లు గత ఆగస్టులో అణు ఇంధన విభాగం వెల్లడించింది. 'సివిల్ లయబిలిటీ ఫర్ న్యూక్లియర్ డ్యామేజ్ యాక్ట్-2010' (సీఎల్ఎన్‌డీ)కి కూడా సవరణలు చేయనున్నారు. ప్రస్తుతం మనదేశంలో ప్రస్తుతం అణువిద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 8,880 మెగావాట్లు ఉంది. దీనిని 2031-32 నాటికి 22,480 మెగావాట్లకు పెంచాలని నిర్ణయించారు. 2070 నాటికి పూర్తిగా కాలుష్యరహిత మార్గాల ద్వారానే (నెట్ జీరో) విద్యుత్ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇంతకుముందు న్యూక్లియర్ భూగర్భ సాంకేతికతపై భారత్ పెరిగిన అసలు శక్తిని చూసి చైనా కూడా ఈ వ్యూహంతో ఇబ్బంది పడుతుందని అంచనా. ఈ కొత్త ప్రణాళిక భారత్‌కు భద్రత, ఆర్థిక వృద్ధికి విప్లవాత్మక మార్గదర్శకంగా నిలుస్తుంది.

## ఆప్టా రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులుగా కాకి ప్రకాష్ రావు, మహాడి లు ఏకగ్రీవ ఎన్నిక..



విభారే న్యూస్ డిసెంబర్ 1 కర్నూలు జిల్లా ప్రతినిధి..ఆదివారం రోజు మచిలీపట్నం లోని స్టార్ షైన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ యందు ఎ పి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశం యందు ప్రస్తుతం రాష్ట్ర అధ్యక్షుడు గా పని చేయుచున్న ఎ జి ఎస్ గణపతి రావు రాజీనామా చేయడం జరిగింది. గణపతి రావు నవంబర్ 30 తేదీన పదవి విరమణ చేయటం జరిగింది. ప్రభుత్వం గుర్తింపు పొందిన సంఘము ల యందు పదవి విరమణ చేసిన వారు పని చేయరాదు అనే నియమం ప్రకారం గణపతి రావు రాజీనామా చేయడం జరిగింది. ఆయన స్థానంలో ప్రస్తుత ప్రధాన కార్యదర్శిగా ఉన్నటువంటి కర్నూలు జిల్లా కు చెందిన కాకి ప్రకాష్ రావు ను రాష్ట్ర అధ్యక్షుడు గా కృష్ణా జిల్లా కు చెందిన ఎం జి మహాడి ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా రాష్టం యందు పని చేసే ఎస్ జి టి ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల యందు ఓటు హక్కు కల్పించాలి, పి ఎస్ ప్రధానోపాధ్యాయుల పదోన్నతి కేవలం సెకండరీ గ్రేడ్ టీచర్ లకు మాత్రమే ఇవ్వాలని, ఒకటి నుండి 10 వరకు తరగతులు జరుపుతున్న ఉన్నత పాఠశాల నుండి ప్రాథమిక పాఠశాల లను విడదీయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సమావేశం అనంతరం మాజీ అధ్యక్షుడు ఎ జి ఎస్ గణపతి రావు దంపతులకు ఘన సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యవర్గ సమావేశం యందు రాష్ట్ర అధ్యక్షుడు కాకి ప్రకాష్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహాడి , రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి నారాయణ రావు, తెలంగాణ రాష్ట్ర ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీశ్ శర్మ, ఆప్టా రాష్ట్ర ఎన్నికల అధికారి రాజా సాగర్ అన్ని జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈ సమావేశం యందు పాల్గొన్నారు.

## జగదీప్ ధన్‌కర్‌కు సరైన ఫేర్‌వెల్ దక్కలేదు: ఖర్గే

న్యూఢిల్లీ: అనారోగ్య కారణాల వల్ల రాజ్యసభ మాజీ చైర్మెన్ జగదీప్ ధన్‌కర్ తన పదవికి అకస్మాత్తుగా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అయితే ఆ అంశాన్ని ఇవాళ రాజ్యసభ ఎంపీ మల్లిఖార్జున్ ఖర్గే లేవనెత్తారు.




ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన సీపీ రాధాకృష్ణన్ ఇవాళ రాజ్యసభ చైర్మెన్‌గా తొలిసారి బాధ్యతలు నిర్వర్తించారు. చైర్మెన్ చైర్ లో ఆయన కూర్చున్న సమయంలో ఖర్గే మాట్లాడారు. రాధాకృష్ణన్‌కు స్వాగతం పలికిన ఆయన తన ప్రసంగంలో మాజీ చైర్మెన్ జగదీవ్ ధన్‌కర్ అంశాన్ని ప్రస్తావించారు. జగదీప్ ధన్‌కర్‌కు సరైన రీతిలో ఫేర్‌వెల్ దక్కలేదని, దీని పట్ల బాధగా ఉందని ఖర్గే అన్నారు. ధన్‌కర్ ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని కోరారు. ఖర్గే ఆరోపణలకు పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు కౌంటర్ ఇచ్చారు. ధన్‌కర్ రాజీనామా ఓ పవిత్ర సందర్భమన్నారు. గతంలో ధన్‌కర్ పట్ల విపక్షాలు అనుచిత రీతిలో ప్రవర్తించినట్లు రిజిజు పేర్కొన్నారు. ప్రతిపక్ష నేత ఈ సమయంలో ఎందుకు ఆ అంశాన్ని ప్రస్తావించారని అడిగారు. మాజీ ఉపరాష్ట్రపతిని తమ భాషతో అవమానించారన్నారు. ధన్‌కర్‌ను తొలగించేందుకు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఆయన గుర్తు చేశారు. ఆ విషయాన్ని తామేమీ మరిచిపోమని రిజిజు అన్నారు. ధన్‌కర్ రాజీనామా గురించి మాట్లాడవద్దు అని, చైర్ హుందాతనాన్ని ఎంతగా దిగజార్చారో తెలుసుకోవాలన్నారు.

## బెంగళూరు ట్రాఫిక్‌తో ఇక్కట్లపాలు.. తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సమాజ్ వాదీ పార్టీ ఎంపీ

బెంగళూరు ట్రాఫిక్ పేరు చెబితే సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకూ భయపడిపోతుంటారు. తాజాగా నగర ట్రాఫిక్ నిర్వహణ తీరుపై సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రాజీవ్ రాయ్ ఆదివారం ఎక్స్ వేదికగా మండిపడ్డారు. గంటకు పైగా ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయానని, పోలీసుల ట్రాఫిక్ నిర్వహణ సరిగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్ణాటక సీఎంను కూడా తన పోస్టులో ట్యాగ్ చేశారు. ట్రాఫిక్ చిక్కుల కారణంగా బెంగళూరుకు చెడ్డ పేరు వస్తోందని అన్నారు. ట్రాఫిక్ పోలీసులతో ఎలాంటి ఉపయోగం లేదని, వారు బాధ్యతారాహిత్యంతో ఉన్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు 'బెంగళూరులో ట్రాఫిక్ నిర్వహణ చాలా దారుణంగా ఉంది. ట్రాఫిక్ పోలీసులతో



ప్రయోజనం శూన్యం. కనీసం ఫోన్ కూడా ఎత్తట్లేదు. చాలా సార్లు వాళ్లకు ఫోన్ చేసేందుకు ప్రయత్నించాను. ఒక్కరు కూడా ఫోన్ లిఫ్ట్ చేయలేదు. గంట నుంచీ మేము రాజ్‌కుమార్ సమాధి రోడ్‌లోనే ఉన్నాము. ఫ్లైట్ మిస్ అయ్యేటట్టు ఉన్నాము. చుట్టుపక్కల ఒక్క ట్రాఫిక్ పోలీసు కూడా కనిపించట్లేదు. బెంగళూరుకు చెడ్డ పేరు తేవడానికి ఇలాంటి అసమర్థ ఆఫీసర్లు చాలు. ట్రాఫిక్ రద్దీ వల్ల బెంగళూరుకు చెడ్డ పేరు వస్తోందనడంలో ఎలాంటి సందేహం లేదు' అని పోస్టు పెట్టారు. పోలీసు ఉన్నతాధికారులను కూడా తన పోస్టులో ట్యాగ్ చేశారు. ఇటీవల వ్యాపారవేత్త కిరణ్ మజుందార్‌షా కూడా నగర రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉందని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అంతకుముందు వ్యోమగామి శుభాన్షు శుక్లా కూడా బెంగళూరు ట్రాఫిక్‌పై సెటైర్లు పేల్చారు. నగర ట్రాఫిక్‌లో ప్రయాణం కంటే అంతరిక్ష యాత్ర కాస్తంత ఈజీగా ఉన్నట్టు అనిపిస్తోందని అన్నారు. ఇదిలా ఉంటే, ట్రాఫిక్ కష్టాలకు పరిష్కారంగా రూ.19 వేల బడ్జెట్‌తో భూగర్భ సొరంగమార్గ నెట్వర్క్‌ను నిర్మించాలని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రతిపాదించారు. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

## విద్యుత్ నో డ్యూ సర్టిఫికెట్ కోసం ఎన్నికల అభ్యర్థుల తిప్పలు

కాసిపేట : మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని సర్పంచ్‌వార్డు సభ్యుల అభ్యర్థులు విద్యుత్ శాఖ నో డ్యూ సర్టిఫికెట్ కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నామినేషన్ కోసం విద్యుత్ శాఖ నో డ్యూ సర్టిఫికెట్ కావాలని తెలపడంతో అభ్యర్థులు మండలంలోని కొండాపూర్ సబ్ స్టేషన్ విద్యుత్ శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు అందుబాటులో లేకపోవడం, ఏఈ లీవ్ లో ఉండడంతో అభ్యర్థులు కార్యాలయానికి వచ్చి నిరాశతో వెనుదిరుగుతున్నారు. కాసిపేట నుంచి బెల్లంపల్లికి వెళ్లడం వల్ల సమయం వృధా అవుతుందని, అక్కడ కూడా త్వరగా పని కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర మండలం కావడంతో ఆలస్యం చేస్తున్నారని, నామినేషన్ సమయం తక్కువగా ఉందని, వెంటనే దీనిపై అధికారులు చర్యలు తీసుకొని స్థానికంగా కాసిపేట మండలంలోనే నో డ్యూ సర్టిఫికెట్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు కోరుతున్నారు.

## హెచ్ ఐవి బాలలకు ఐఎంఏ అండ- 50 వేల విలువైన పరుపులు, దుస్తుల పంపిణీ




---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 01-ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో పరివర్తన లైఫ్ సెంటర్‌లోని హెచ్ఐవి బాలలకు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఐఎంఏ నంద్యాల మహిళా వైద్య విభాగం తరఫున 25 వేల రూపాయల విలువైన 10 కొత్త పరుపులను సెంటర్ నిర్వాహకులు అబ్రహం లింకన్ కు అందజేశారు. అలాగే సెంటర్‌లో ఉన్న బాలలకు 25 వేల రూపాయల నూతన రెడీమేడ్ దుస్తులను శ్రీకరి హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ విజయబాబు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, ఐఎంఏ నంద్యాల అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాసరావు, మహిళా వైద్య విభాగం అధ్యక్షురాలు డాక్టర్ మాధవి, కార్యదర్శులు డాక్టర్ సునీత, డాక్టర్ హరిత, డాక్టర్ తనూజ, డాక్టర్ లలిత, ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్ విజయభాస్కర రెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు. పరివర్తన లైఫ్ సెంటర్ బాలలకు పలు సంవత్సరాలుగా సహకారం అందిస్తున్నామని, భవిష్యత్తులో కూడా హెచ్ఐవి బాధితుల కోసం అవగాహన కార్యక్రమాలు, అవసరమైన సాయాన్ని కొనసాగిస్తామని వైద్యులు తెలిపారు. సెంటర్ నిర్వాహకులు అబ్రహం లింకన్ ఐఎంఏ వైద్యులకు ధన్యవాదాలు తెలిపారు.

## అసౌకర్యాలపై పట్టింపే లేదా.. నామినేషన్ వేసే అభ్యర్థుల ఆగ్రహం




మునిపల్లి, డిసెంబర్ 01 : అసౌకర్యాల మధ్య నామినేషన్ల ప్రక్రియ జోరుగా కొనసాగుతుంది. నామినేషన్ వేసేందుకు వచ్చిన అభ్యర్థులు సరైన ఏర్పాట్లు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. మునిపల్లి మండల కేంద్రమైన మునిపల్లితోపాటు, మండలం పరిధిలోని బుదేరా, కంకోల్, పెద్దచేల్మడ, పెద్దల్లోడి గ్రామాల్లో గల రైతు వేదికల వద్ద నామినేషన్లు వేసేందుకు సౌకర్యాలు సరిగ్గా ఏర్పాటు చేయకపోవడంతో లబ్ధిదారులు ఎక్కడ నీడ ఉంటే అక్కడ కూర్చుంటూ అవస్థలు పడుతున్నారు. మునిపల్లి మండలంలో సంబంధిత అధికారులు పట్టింపు లేనట్టు వ్యవహరించడంతో నామినేషన్లు వేసేందుకు వచ్చిన ఆయా గ్రామాల లబ్దిదారులు అనేక అవస్థలు పడుతున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న సంబంధిత అధికారులపై చర్యలు తీసుకొని నామినేషన్ కేంద్రాల వద్ద మెరుగైన ఏర్పాట్లు చేయాలని అభ్యర్థులు ఉన్నత అధికారులను కోరుతున్నారు.

## కేరళ సీఎంకు బాంబు బెదిరింపులు.. అప్రమత్తమైన పోలీసులు



న్యూఢిల్లీ: దేశంలో బాంబు బెదిరింపులు కలకలం రేపుతున్నాయి. తాజాగా కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కు బెదిరింపులు వచ్చాయి. సీఎం అధికారిక నివాసంతోపాటూ పాలయంలోని ఓ ప్రైవేట్ బ్యాంకు, సీఎం వ్యక్తిగత కార్యదర్శికి కూడా ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. సీఎం నివాసంతోపాటూ, మిగతా రెండు చోట్లా బాంబులు పెట్టినట్లు ఆగంతకులు మెయిల్ పంపించారు. ఈ బెదిరింపులతో అప్రమత్తమైన పోలీసులు సోదాలు చేపట్టారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో రెండు చోట్లా తనిఖీలు చేశారు. ప్రస్తుతం సోదాలు కొనసాగుతున్నాయి. మరోవైపు బెదిరింపు ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## క్యాబిన్ సిబ్బందికి లైంగిక వేధింపులు.. టెకీ అరెస్ట్

విమానాల్లో కొందరు ప్రయాణికులు అనుచితంగా ప్రవర్తిస్తూ తోటి ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న ఘటనలు ఇటీవలే తరచూ చోటు చేసుకుంటున్న విషయం తెలిసిందే. తాజాగా అలాంటి ఘటనే మరొకటి వెలుగులోకి వచ్చింది. ఓ టెకీ క్యాబిన్ సిబ్బందిని లైంగికంగా వేధించి చివరికి కటకటాల పాలయ్యాడు. ఈ ఘటన దుబాయ్ నుంచి హైదరాబాద్ ఎయిర్ ఇండియా విమానంలో చోటు చేసుకుంది. నవంబర్ 28న ఎయిర్ ఇండియా కు చెందిన విమానం దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు వచ్చింది. ఆ సమయంలో విమానంలోని మహిళా ప్రవర్తిస్తూ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. దీంతో సిబ్బంది అధికారులకు ఫిర్యాదు చేశారు.



# భూసేకరణకు అంతే లేదా...

విజయవాడ, డిసెంబర్ 1, ప్రభుత్వం పారదర్శకంగా ఉండాలి. ప్రజలకు తాము తీసుకుంటున్న నిర్ణయాలను వివరించాలి. గోప్యంగా ఉంచితే అనేక అనుమానాలు బయలుదేరతాయి. రాజధాని అమరావతి విషయంలోనూ ఇదే జరుగుతుంది. గతంలో మొదటిదశలో రైతుల నుంచి సేకరించిన 34 వేల ఎకరాలు, ప్రభుత్వానికి సంబంధించిన భూములు మొత్తం యాభై నాలుగు వేల ఎకరాలున్నాయి. అయితే ఈ యాభై నాలుగు వేల ఎకరాల్లో కేవలం ఏడు వందల ఎకరాలు మాత్రమే మిగిలాయని ప్రభుత్వం చెబుతుంది. మరొకసారి రెండో విడత భూసేకరణకు సిద్ధమయింది. దీంతో అనేక అనుమానాలు ప్రజలు, రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. అయితే ప్రధాన మీడియాల్లోనూ, సోషల్ మీడియాల్లోనూ అనేక రకాలుగా ప్రచారం జరుగుతుంది. కప్పి ఉంచడం వల్ల రెండో విడత సమీకరణపై పడే అవకాశముంది.రాజధాని పేరుతో సేకరించిన తొలివిడత 54 వేల ఎకరాల్లో రాజధాని ఎక్కడ అన్నది చెప్పాలన్నది ప్రజల నుంచి వినిపిస్తున్న ప్రశ్న. ముంబయి ఛత్రపతి విమానాశ్రయం 1850 ఎకరాల్లో ఉంటే అమరావతికి ఐదు వేల ఎకరాలు ఎందుకన్న ప్రశ్న తలెత్తుంది. పైసా తీసుకోకుండా రాజధాని కోసం రైతులు భూములు ఇస్తే పప్పు బెల్లాలుగా ఇష్టమొచ్చినట్లు పంపిణీ చేయడం ఏంటన్న ప్రశ్న తలెత్తుంది. ఇంజినీరింగ్ కళాశాలలకు ఎకరం యాభై లక్షలకు కేటాయించినా కనీసం రాజధాని రైతుల పిల్లలకు ఆ కళాశాలల్లో రాయితీ కూడా ఇవ్వడం లేదు. తామిచ్చిన భూముల్లోనే తమపై పెత్తనం ఎందుకని కొందరు రైతులు ప్రశ్నిస్తున్నారు. మొదటి దశలో 25 గ్రామాల నుంచి 34 వేల ఎకరాలు తీసుకున్నారు. 29 వేల మంది రైతులు భూములు ఇచ్చారు. వారికి ఇచ్చిన ప్లాట్లకు మౌలిక సదుపాయాలు కల్పించకుండా రెండో విడత భూసమీకరణకు ప్రభుత్వం ఎందుకు సిద్ధమవ్వాలని వారు ప్రశ్నిస్తున్నారు.ఒకవైపు తమ సమస్యలు పదకొండేళ్ల నుంచి అలాగే ఉన్నా, మరికొందరిని బలి చేయడానికి ఎందుకు నిర్ణయాలు తీసుకుంటారని రాజధాని రైతులు ప్రశ్నిస్తున్నారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు కూడా ఇదే ప్రశ్నను లేవనెత్తారు. రాజధానికి రెండో విడత భూసమీకరణకు భూములిచ్చి తొలి విడత ఇచ్చిన రైతులకు అన్యాయం చేయవద్దని ఆయన కోరుతున్నారు. అసలు యాభై నాలుగు వేల ఎకరాలకు ఎవరెవరికి ఇచ్చారని శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఏదైనా ఒకటి అభివృద్ధి జరిగిన తర్వాత మరొక దానిని అభివృద్ధి చేయడం కోసం సేకరించాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ పనిచేయకుండా రాజధాని నిర్మాణానికి ఎన్ని వేల ఎకరాలు కావాలో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.మొదటి దశలో ఇచ్చిన భూముల్లో డిజైన్లు వేసి రాజధాని నిర్మాణానికి ఓకే అని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు తాజాగా మలి విడత భూసమీకరణకు తాము ఎందుకు సహకరించాలన్న ప్రశ్న రైతుల నుంచి సూటిగా వినిపిస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం పారదర్శకంగా రాజధాని భూముల విషయంలో వ్యవహరించాలని కోరుతున్నారు. అలాగని ముందుకు వెళితే తాము న్యాయస్థానాలను ఆశ్రయించక తప్పదని వడ్డే శోభనాద్రీశ్వరరావు లాంటి రైతు సంఘాల నేతలు హెచ్చరిస్తున్నారు. ఏ రాష్ట్రంలోనైనా విమానాశ్రయం ముప్ఫయి నుంచి నలభై కిలోమీటర్ల దూరంలో ఉంటుందని, కానీ రాజధాని నడిబొడ్డులో విమానశ్రయం నిర్మాణం అవసరమా? ఇక గన్నవరం విమానాశ్రయాన్ని ఏం చేయనున్నారో చెప్పాలంటూ నిలదీస్తున్నారు. మొత్తం మీద రెండో విడత భూసమీకరణ మాత్రం ప్రభుత్వానికి అంత తేలికగా కనిపించడం లేదు.అమరావతి రెండో విడత ల్యాండ్ పూలింగ్ వద్దని కాంగ్రెస్ పార్టీ ఏపీ చీఫ్ షర్మిల స్పష్టం చేసారు. రాజధాని పేరుతో రియల్ ఎస్టేట్ మాఫియా జరుగుతోందన్నారు. విజయవాడలో మీడియాతో మాట్లాడిన ఆమె మొదటి దశలో 25 గ్రామాల నుంచి 34 వేల ఎకరాలు తీసుకున్నారు.. 29 వేల మంది రైతులు భూములు ఇచ్చారు. ఇది కాకుండా ప్రభుత్వ భూములు కలుపుకునే 54 వేల ఎకరాలు ఉందన్నారు. 11 ఏళ్లుగా అమరావతికి రూపు లేదు. ఒక్క కిలోమీటర్ అభివృద్ధి కూడా జరగలేదు. 54 వేల ఎకరాల్లో అమరావతి నిర్మాణం జరిగినట్లు బిల్డప్ ఇస్తున్నారని ఆరోపించారు. తీసుకున్న 54 వేల ఎకరాల సంగతి ఏంటి ? మీరు చెప్పిన అభివృద్ధి ఎక్కడ ? రెండో విడత భూములు 16 వేల ఎకరాలు ఇప్పుడు ఎందుకో చెప్పాలని డిమాండ్ చేసారు. అమరావతి రైతులను చంద్రబాబు బెదిరిస్తున్నారని.. అమరావతి అంతర్జాతీయ నగరం కావాలంటే రెండో విడత కావాలని బ్లాక్ మెయిల్ చేస్తున్నరని మండిపడ్డారు. అమరావతి మున్సిపల్ సిటీగా కావాలా...గ్లోబల్ సిటీగా కావాలని అడగడం విడూరం ప్రపంచంలోనే గ్లోబల్ సిటీ అన్నప్పుడు మున్సిపాలిటీ అని అర్థం కాలేదా అని ప్రశ్నించారు. 29 వేల మంది రైతులను మీరు వెన్నుపోటు పొడుస్తున్నారు.. 34 వేల ఎకరాలు ఇచ్చిన రైతుల భూములకు విలువ లేనట్లు మాట్లాడుతున్నారు. రెండో విడత భూములు ఇవ్వక పోతే.. అమరావతి రాజధాని కాదు అని బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. మొదటి దశ భూములకు విలువ ఉండాలి అంటే రెండో విడత ఇవ్వాలి అనడం దుర్మార్గమన్నారు. రెండో విడత భూములు ఇవ్వకపోతే రాజధాని నిర్మాణం జరగదా ? 29 వేల మంది రైతులు మిమ్మల్ని ఏమనుకోవాలి ? మంత్రి నారాయణ కేవలం 700 వందల ఎకరాలు మాత్రమే మిగిలింది అని చెప్పారట .. 54 వేల ఎకరాల్లో 700 ఎకరాలు మిగలడం ఏంటని ప్రశ్నించారు. చేసిన భూ కేటాయింపులకు ఎంత ఆదాయం...ఎన్ని ఉద్యోగాలు వస్తాయి ? ఈ వివరాలు అన్ని ఎందుకు దాచి పెడుతున్నారో చెప్పాలన్నారు. ప్రపంచ దేశాల్లో ఒలంపిక్స్ నిర్వహించిన బీజింగ్,లండన్ దేశాల్లో చూస్తే 150 ఎకరాల్లో దాటలేదు. ఇక్కడ స్పోర్ట్ సిటీకి 2500 ఎకరాలు ఎందుకో చెప్పాలన్నారు. విశాఖ అఎఎ సమ్మిట్ లో వచ్చిన పెట్టుబడులు 13 లక్షల కోట్లు ఇందులో 90 శాతం విశాఖలోనేనని గుర్తు చేశారు. మొదటి విడత రైతులకు న్యాయం చేయని వాళ్ళు..రెండో విడత రైతులకు ఎలా చేస్తారో చెప్పాలన్నారు. రాజధాని నిర్మాణం కేంద్రం బాధ్యత అయినప్పుడు ఇన్ని లక్షల కోట్లు ఎందుకు అప్పు చేస్తున్నారు ? . సెల్ఫ్ ఫైనాన్స్ సిటీ అని చెప్పి భూములు ఎందుకు అమ్మాలని చూస్తున్నారు వెంటనే శ్వేత పత్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు. వైసీపీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు కూడా ల్యాండ్ పూలింగ్ ను వ్యతిరేకించారు. అమరావతి రాజధాని అభివృద్ధిని 'మెగా సీరియల్'లా నడుపుతూ రైతుల భూములపై దోపిడీ చేస్తున్నారని ఆరోపణలు చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, అమరావతికి అసలైన 'విలన్' చంద్రబాబు నాయుడేనన్నారు.

## ఇక పెరిగేది ఎప్పుడూ...

విశాఖపట్టణం, డిసెంబర్ 1,దేశంలో బీజేపీకి బలమైన నాయకత్వం ఉంది. మోదీ, అమిత్ షా వంటి వారు ఎప్పటికప్పుడు రాజకీయ వ్యూహాలను రచించుకుంటూ పార్టీని అన్ని రాష్ట్రాల్లో గెలుపు దిశగా తీసుకెళుతున్నారు. కానీ ఆంధ్రప్రదేశ్ మాత్రం మోదీ, అమిత్ షా చేతుల్లో లేదని వారికీ అర్థమయింది. ఇక్కడ రాష్ట్ర స్థాయి నేతలు ఎవరూ పెద్దగా పార్టీని బలోపేతం చేసే ప్రయత్నం చేసేందుకు ప్రయత్నించరు. గత కొన్ని దశాబ్దాల నుంచి బీజేపీకి ఏపీలో పట్టు లేదు. ఒంటరిగా పోటీ చేస్తే సింగిల్ డిజిట్ ఓటింగ్ శాతానికి మాత్రమే పరిమితమవుతుంది. అందుకే టీడీపీ, జనసేన అండతోనే పార్లమెంటు స్థానాలయినా, అసెంబ్లీ సీట్లయినా గెలిచింది. బీజేపీ నేతలు తమ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విఫలమవుతున్నారన్న విమర్శలు ఇప్పటి నుంచి కాదు ఎప్పటి నుంచో వినిపిస్తున్నాయి.ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు కానీ, విభజన తర్వాత కానీ బీజేపీ ఏపీలో ఏదైనా బలపడిందా? అంటే లేదనే సమాధానమే వస్తుంది. పోనీ నాయకత్వం సరైనది లేదా? అంటే ఎందుకు లేరు.. ముప్పవరపు వెంకయ్య నాయుడు నుంచి కంభపాటి హరిబాబు, సోము వీర్రాజు, పురంద్రీశ్వరి.. నేడు మాధవ్ ఇలా రాజకీయాల్లో పట్టున్న వారే. కొంత జనాకర్షణ కలిగిన నేతలే. సామాజికవర్గం అండగా ఉన్న లీడర్లే. కానీ ఏ నియోజకవర్గంలోనూ ఒంటరిగా గెలిచేటంతగా పార్టీని తీసుకెళ్లలేకపోవడానికి కారణాలపై ఇంత వరకూ కమలం పార్టీలో అంతర్మథనం జరగలేదు. పొరుగున ఉన్న తెలంగాణలో ఒంటరిగా బీజేపీ బలపడుతున్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ లో మాత్రం ఇంత వరకూ ఒక్క పర్సెంట్ కూడా ఎదగలేదన్నది యదార్థం.దీనిపై కేంద్ర నాయకత్వం కూడా ఒకింత సీరియస్ గానే ఉందని తెలిసింది. కేంద్ర మంత్రి పదవులు, రాష్ట్రంలో మంత్రి పదవులు, గవర్నర్ గిరీ కట్టపెట్టినా ఏ మాత్రం ఫలితం ఎందుకు ఉండలేదని జాతీయ స్థాయి నాయకత్వంలో చర్చ ప్రారంభమయినట్లు తెలిసింది. ఎప్పటికీ ఇతరులపై ఆధారపడి ఎన్నేళ్లు రాజకీయాలు చేయాలన్న అసహనం కూడా అగ్రనాయకత్వం వ్యక్తం చేస్తున్నట్లు కనపడుతుంది. అందుకే బీజేపీ కేంద్ర నాయకత్వం ఏపీని తమ జాబితా నుంచి తొలగించినట్లేనని భావిస్తుంది. అలాగని పార్టీని పూర్తిగా వదిలేయడం మంచిది కాదని, త్వరలోనే కేంద్ర నాయకత్వం రాష్ట్ర నాయకులను పిలిచి క్లాస్ పీకే అవకాశాలు కూడా లేకపోలేదన్నది హస్తిన వర్గాల ద్వారా అందుతున్న సమాచారం. మరి ఇప్పటికైనా బీజేపీ రాష్ట్ర నాయకత్వంలో కదలిక వస్తుందా? లేదా? అన్నది చూడాలి.

## కృష్ణా జిల్లాలో స్క్రబ్ టైఫస్"

విజయవాడ, డిసెంబర్ 1, మూడేళ్ల క్రితం ఢిల్లీ, తమిళనాడులో కనిపించిన 'స్క్రబ్ టైఫస్ " అనే జ్వరాలు ఇప్పుడు కృష్ణా జిల్లాలో ముఖ్యంగా మచిలీపట్నం నుంచి వచ్చే రోగుల్లో నమోదు అవుతున్నాయని అంటున్నారు కొందరు డాక్టర్లు. చాలా కాలం హై ఫివర్, ప్లేట్ లెట్స్ పడిపోవడం వంటివి దీని లక్షణాలుగా వారు చెబుతున్నారు. ఈ వ్యాధి వచ్చిన వాళ్ళు వెంటనే సరైన వైద్యం తీసుకోకుంటే కొన్నిసార్లు ప్రాణాంతకమయ్యే ప్రమాదం ఉందని కృష్ణా జిల్లా నుంచి వస్తున్న కేసుల్లో ఇలాంటి లక్షణాలు కనిపిస్తున్నాయని విజయవాడకు చెందిన ఊపిరి హాస్పిటల్స్‌లో ఎండీగా పని చేస్తున్న ఆతీ. రఘు రామ్ ఒక వీడియోలో తెలిపారు. అయితే విజయవాడ నుంచి జ్వరంతో వచ్చిన వాళ్లలో ఈ వ్యాధి ఇంతవరకూ కనిపించలేదని ఆయన అన్నారు మట్టిలో ఉండే చిన్న నల్లిలాంటి క్రిమి కాటుతో ఈ వ్యాధి వస్తుంది. చాలా కాలం జ్వరం ఉండడం ప్లేట్లు లెట్స్ పడిపోవడంతో ఇది "డెంగీ " అని భ్రమ పడతారు. కానీ నిర్ణీత పరీక్షలతో ఈ వ్యాధి ని నిర్ధారించవచ్చని డాక్టర్స్ చెబుతున్నారు. అందుకే సాధారణ జ్వరం అని ఆలస్యం చేయకుండా లక్షణాలు కనిపించగానే డాక్టర్ వద్దకు వెళ్లాల్సిందిగా వారు ప్రజలకు సూచిస్తున్నారు. సాధారణంగా శీతాకాలంలో అక్కడక్కడా ఈ వ్యాధి కనిపిస్తుందని ఎక్కువగా కొండ ప్రాంతాల్లో కనిపించే ఈ పురుగు ఇప్పుడు సిటీల్లో సైతం కనిపించడం ఆందోళన కలిగిస్తుందని వైద్యులు అంటున్నారు. మట్టిలో కలిసిపోయే ఈ పురుగు కాటు వల్ల ప్లేట్ లెట్స్ పడిపోతాయని నిర్లక్ష్యం చేస్తే బాడీలో మల్టీపుల్ ఆర్గాన్స్ దెబ్బ తినే ప్రమాదం ఉందని డాక్టర్స్ అభిప్రాయ పడుతున్నారు. ముఖ్యంగా ఊపిరితిత్తులకు ఈ వ్యాధి సోకితే అలాంటివారు రికవర్ కావడం కాస్త కష్టం అని డాక్టర్ రఘురామ్ అభిప్రాయపడ్డారు.

## పిఠాపురంలో నిండా మునిగిన అధికారులు

కాకినాడ, డిసెంబర్ 1, పిఠాపురం మున్సిపాల్టీలో ఇంజనీరింగ్ అధికారులపై చర్యలకు ప్రభుత్వం ఆదేశం.. వైసీపీ నేతల మాటలు విని నిండా మునిగారా..?ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తోన్న పిఠాపురం నియోజకవర్గంలో పిఠాపురం మున్సిపాలిటీలో అవినీతి అధికారులపై చర్యలకు ఆదేశించింది ప్రభుత్వం.. గత వైసీపీ పాలనలో జరిగిన అవినీతిపై విచారణ చేసిన అధికారులకు అక్రమాల దోపిడీ బట్టబయలయ్యింది.. దీంట్లో భాగంగా కొందరు అధికారులపై చర్యలకు ఉపక్రమించారు ఉన్నతాధికారులు.. పిఠాపురం మున్సిపాలిటీలో గత పాలకులను నమ్మి పనిచేసిన పాపానికి కొంత మంది అధికారులు నిండా మునిగిపోయిన పరిస్తితి కనిపిస్తోంది.. పిఠాపురం మున్సిపాల్టీలో గతంలో ఇక్కడ పనిచే సిన ఇద్దరు డీఈలతోపాటు, ముగ్గురు ఏఈలపై ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. విజిలెన్స్ అధి కారులు ఇచ్చిన నివేదికపై అక్రమాలకు పాల్పడ్డ అధికారులపై ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. వైసీపీ హయాంలో జరిగిన పాపాలకు ఇప్పుడు అధికారులు బలవ్వడం స్థానికంగా సంచలనంగా మారింది.పిఠాపురం మున్సిపాలిటీలో అవినీతికి అంతే లేదని ఆరోపణలు వెల్లువెత్తాయి.. చేయని పనులకు బిల్లలు పెట్టుకుని దోపిడీ పర్వానికి పాల్పడ్డారని ప్రజలు ఫిర్యాదులు చేసినా పట్టించుకున్న నాధులు లేని పరిస్థితి కనిపించింది.. వేయని తాగునీటి పైపులైను వేసినట్లుగా చూపించి బిల్లులు డ్రా చేయడం, వేయని రోడ్లు వేశామని బిల్లులు సృష్టించి కాజేయడం వంటి ఆరోపణలు ఇక్కడ పనిచేసిన అధికారులపై తీవ్రంగా ఉంది.. వైసీపీ పాలనలో పిఠాపురం మున్సిపాల్టీలో 14వ ఆర్థిక సంఘం నిధులకు సంబందించి జరిగిన అభివృద్ధి పనుల్లో సుమారు రూ.7 కోట్ల నిధులు గోల్‌మాల్ చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తగా ఆ ఆరోపణలు, ఫిర్యాదులు అన్నీ బుట్టదాఖలు అయ్యాయి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక, పైగా పిఠాపురం ఎమ్మెల్యేగా పవన్ కళ్యాణ్ గెలిచాక అందరిలోనూ భయం మొదలయ్యింది.. పిఠాపురం పురపాలక సంఘ పరిధిలో అభివృద్ధి పేరిట అనేక అవకతవకలు జరిగినట్లు విజిలెన్స్ అధికారులు నిర్ధారించారు. వీటిలో ముఖ్యంగా జగ్గయ్యచెరువు కాలనీ, డ్రైవర్స్ కాలనీతోపాటు, మాధవపురం రోడ్డులోని మున్సిపాల్టీకి చెందిన ప్రాంతంలో జరిగిన పనుల్లో లోని భారీ అవకతవకలను విజిలెన్స్ అధికారుల కమిటీ గుర్తించింది. గుడ్డిగా పనులు చేసి, బిల్లులు మంజూరు చేసారని. అన్ని తెలిసి అధికారులు వ్యవహరించారని నిర్ధారించింది. ఏకంగా రూ.30 లక్షల నిధులకు అసలు పనులు జరగలేదని, అయినప్పటికీ ఆ నిధులను డ్రా చేసినట్లు తేల్చింది. వీటితోపాటు పనులు నాసిరకం, ఇష్టానుసారంగా నిధుల దుర్వినియోగం జరిగాయని విజిలెన్స్ లో స్పష్టం చేసింది. ఈ అధికారులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.1339 ని విడుదల చేసింది. నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఇంజనీరింగ్ అధికా రులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.పిఠాపురం మున్సిపాల్టీలో డీఈలుగా పనిచేసిన భవానీ శంకర్, ఎమ్.టి.హుస్సేన్ పాటు, ఏఈలుగా పనిచేసిన వంశీ అభిషేక్, నరసింహ రావు, రత్నవల్లిలపై ప్రభుత్వం చర్యలకు ఆదే శించింది. వీరు పనిచేసిన కాలంలో జరిగిన పనుల్లో భారీ అవకతలను విజిలెన్స్ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో స్పష్టంగా పేర్కొంది. 184 పేజీలతో కూడిన ఆ నివేదికతో కలిపి ప్రభుత్వం అధికారులపై చర్యలు తీసుకోవాలని తాజాగా జీవో జారీ చేసింది. ఆరోపణలను ఎదుర్కొంటున్న ఈ అధికారులంతా ప్రస్తుతం వేరే చోట్ల పనిచేస్తున్నారు.అప్పట్లో పిఠా పురంలో ఉన్న వైసీపీ నేతల అండతో వీరంతా ఇష్టా నుసారంగా అవకతవకలకు ఆజ్యం పోశారు. ముఖ్యంగా వైసీపీ అనుకూల కాంట్రాక్టర్లకు మేలు చేసేందుకు గు గుడ్డిగా ఎమ్ బుక్ లను చేయడం. బిల్లులు డ్రా చేసేందుకు అనుకూలంగా సంతకాలు చేశారు. జరగని పనులకు కూడా జరిగినట్లుగా చూపించి నిధులు డ్రా చేసి అడ్డంగా బుక్కయ్యారు. గతంలో దీనిపై పిఠాపురం టీడీపీ కౌన్సిలర్లు పలుమార్లు కౌన్సిల్ సమావేశాల్లో చర్చించడం, అధికారుల దృష్టికి తీసుకెళ్లడం చేసినప్పటికీ, అప్పట్లో వైసీపీ అండతో వీరంతా లెక్క చేయకుండా పని చేశారు. ప్రస్తుతం ఆ పర్యవసనాలను ఎదుర్కొంటున్నారంటున్నారు.

## అంతుపట్టని వ్యూహం

కాకినాడ, డిసెంబర్ 1, పవన్ కళ్యాణ్ ఒక వ్యూహం ప్రకారం అడుగులు వేస్తున్నారు. అది స్పష్టంగా తెలుస్తుంది కూడా. ఒకవైపు తన శాఖల ద్వారా గ్రామీణ, గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నారు. అదే సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల విధ్వంసాలను బయటకు తెస్తున్నారు. ఏకకాలంలో అభివృద్ధి, వైసిపి వైఫల్యాలు ప్రజలకు అర్థమయ్యేలా చేస్తున్నారు. మొన్న మధ్యన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అటవీ భూముల ఆక్రమణ వ్యవహారం పవన్ బయట పెట్టిన తర్వాత ప్రజల్లోకి బలంగా వెళ్ళింది. తాజాగా పల్లె పండుగ 2.0 ప్రారంభం కావడంతో పల్లెల్లో సందడి నెలకొంది. ఏకకాలంలో పవన్ వ్యూహం తెలియక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సతమతం అవుతోంది. పవన్ విషయంలో ఎలా ముందుకెళ్లాలో తెలియక మల్లగుల్లాలు పడుతోంది. పవన్ వ్యూహాత్మక శైలి విశ్లేషకులను సైతం ఆశ్చర్యపరుస్తుంది.కూటమి సమన్వయంతో ముందుకు సాగుతోంది. సీఎం చంద్రబాబు పాలనపై పూర్తిగా దృష్టిపెట్టారు. లోకేష్ విదేశీ పెట్టుబడులపై ఫోకస్ చేశారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తెస్తున్నారు. వాటి జోలికి పవన్ కళ్యాణ్ పోవడం లేదు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధికి సంబంధించి పవన్ కళ్యాణ్ పూర్తి స్వేచ్ఛ తో పనిచేస్తున్నారు. అటవీ శాఖతో పాటు గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై పవన్ తనదైన శైలిలో ముందుకు వెళుతున్నారు. అంటే కచ్చితంగా దీని వెనుక వ్యూహం ఉంటుంది. వ్యూహం ప్రకారమే ఆ ముగ్గురు నేతలు ముందుకెళుతున్నారు. రాజకీయంగా అవసరమైన ప్రతిసారి పవన్ వచ్చి బయట మాట్లాడుతున్నారు. అందులో భాగంగా పెద్దిరెడ్డి లాంటి పెద్ద నేత విషయంలో పవన్ చెప్పేసరికి ప్రజల్లోకి వెళ్ళింది. అదే చంద్రబాబు చెబితే దశాబ్దాల వైరం వారి మధ్య ఉండడంతో కావాలనే చెప్పారని ప్రత్యర్థులు ఆరోపించేవారు.మరో 15 ఏళ్ల పాటు ఏపీలో కూటమి ప్రభుత్వం ఉంటుందని పవన్ కళ్యాణ్ పదేపదే చెబుతున్నారు. ఆ మాట వెనుక ఉన్న మర్మం ఏమిటో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి తెలియడం లేదు.

## ప్రతిపక్ష పార్టీపై ప్రశ్నలా...

### నారాయణ... నారాయణ



విజయవాడ, డిసెంబర్ 1,సీపీఐ జాతీయ నేత నారాయణ చేస్తున్న వ్యాఖ్యలు ఆ పార్టీని మరింత కిందకు చేరేలా చేస్తున్నాయి. అసలే దేశంలోనే కాదు.. అన్ని రాష్ట్రాల్లో సీపీఐ అనేది ఎక్కడా కనిపించడం లేదు. ఇప్పుడు ఏపీలోనూ నారాయణ పూర్తిగా పార్టీని తుడిచిపెట్టడానికి కంకణం కట్టుకున్నట్లు కనిపిస్తుంది. నారాయణ చచ్చిపోయిన పామును చంపుతూనే ఉండటం ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. వైసీపీ పై ఇప్పుడు ఎన్ని విమర్శలు చేసినా ఫలితం లేదు. సీపీఐ ఒక్క అడుగు కూడా పైకి లేవదు. పరకామణి కేసులో వెంటనే స్పందించిన సీపీఐ నారాయణ రాజధాని అమరావతి రెండో దశ భూసమీకరణ విషయంలో అసలు మాట్లాడకపోవడం కూడా చర్చనీయాంశమైంది. విశాఖ స్టీల్ ప్లాంట్ పై కూడా పెదవి విప్పడం లేదుప్రజలకు పనికి రాని వాటిన్నంటినీ నారాయణ పట్టుకుని వేలాడుతున్నట్లే కనపడుతుంది. బిగ్ బాస్ పై పెద్ద పోరాటమే చేస్తున్నాడు. అది అవసరమా? చూసేవారు చూస్తారు. లేకుంటే లేదు. వైసీపీ ఇప్పుడు అధికారంలో లేదు. దానిని ప్రశ్నించి నిలదీసినా ఏ మాత్రం ప్రయోజనం లేదు. అసలు విషయాలను పక్కన పెట్టి రాజధాని అమరావతి కోసం పదకొండేళ్ల క్రితం భూములిచ్చిన రైతులకు అండగా నిలబడాల్సిన నారాయణ అది పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పరకామణి కేసులో సీఐడీ చర్యలు తీసుకుంటుంది. అందులో తప్పు జరిగిందని భావిస్తే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. కానీ రాజధాని రైతులకు అండగా నిలిచేదెవరు? ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన నారాయణ ప్రతిపక్షాన్ని నిలదీయడంలో అర్థం లేనిదన్న కామెంట్స్ సోషల్ మీడియాలో ఎక్కువగా వినిపిస్తున్నాయి.అసలు నారాయణ తన పార్టీ నిర్ణయాన్ని స్పష్టంగా చెబితే బాగుంటుంది. నాడు రాజధాని అమరావతిలోనే ఉండాలని సీపీఐ ఆధ్వర్యంలో పెద్దయెత్తున ఉద్యమం చేశారు. అది వైసీపీ ప్రభుత్వ హయాంలో. కానీ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేయడంలోనూ, రాజధాని అమరావతి విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రశ్నించడంలోనూ నారాయణ ఎందుకో వెనకబడినట్లే కనిపిస్తుంది. బీజేపీతో చేతులు కలిపిన టీడీపీని పరోక్షంగా నారాయణ సమర్థిస్తున్నారన్న ప్రచారం మాత్రం సోషల్ మీడియా వేదికగా ఎక్కువగా జరుగుతుంది. పరకామణి సంగతి పక్కన పెట్టి నారాయణా.. ఇకనైనా రైతుల పక్షాన నిలిస్తే బాగుంటుందన్న సూచనలు సొంత పార్టీ నేతల నుంచే వినిపిస్తున్నాయి. మరి నారాయణ మారతారా? లేదా?

## స్థానిక ఎన్నికలకు దూరమేనా

విజయవాడ, డిసెంబర్ 1, వైసీపీ అధినేత వైఎస్ జగన్ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్నట్లు కనిపించడం లేదు. మరో రెండు నెలలు మాత్రమే ఎన్నికలకు సమయం ఉంది. జవరి లో ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయి. అయితే స్థానిక సంస్థల ఎన్నిలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేసే దిశగా మాత్రం జగన్ ఏ మాత్రం ఫోకస్ పెట్టలేదు. స్థానికసంస్థల ఎన్నికల్లో ఎటూ అధికార పార్టీకి అనుకూలంగా ఫలితాలు ఉంటాయని భావించి వాటిని వదిలేశారా? అన్న అనుమానం వ్యక్తమవుతుంది. నిజానికి స్థానికసంస్థల ఎన్నిలకు ముందస్తు ప్రిపరేషన్ చేసుకోవాలంటే తొలుత నియోజవర్గాల వారీగా సమీక్షలు నిర్వహించాలి. అనేక నియోజకవర్గాల్లో ఇప్పటికీ పార్టీకి ఇన్ ఛార్జులు లేరు.అంటే జగన్ స్థానిక సంస్థల ఎన్నికలపై సీరియస్ గా లేనట్లే కనిపిస్తుంది. అయితే స్థానిక సంస్థల ఎన్నికలు జరిగిన తర్వాత మాత్రమే తమ ఓటు బ్యాంకు, పార్టీ క్యాడర్ గ్రామ, మండల, మున్సిపాలిటీ, కార్పొరేషన్ స్థాయిలో స్థిరపడుతుందని జగన్ భావిస్తున్నప్పటికీ ఇప్పటి నుంచే ఎందుకన్న ధోరణిలో జగన్ ఉన్నట్లు కనిపిస్తుంది. జగన్ స్థానిక సంస్థల ఎన్నికల కోసం జిల్లాల పర్యటనలు చేయాల్సిన అవసరం లేదు. అలాగని ఊరికే కూర్చోకూడదు. ముందుగా నియోజకవర్గాల్లో ఇన్ ఛార్జులను నియమించడంతో పాటు లోకల్ ఎన్నికలకు సంబంధించి తన మనసులో ఉన్న మాటలను నియోజకవర్గాల ఇన్ ఛార్జులకు చెప్పాలి. అప్పుడే అభ్యర్థుల ఎంపికలో ఒక స్పష్టత ఉంటుంది.అభ్యర్థుల ఎంపిక స్థానిక సంస్థల ఎన్నికల్లో కీలకం. తాడేపల్లి కేంద్ర పార్టీ కార్యాలయంలో కూర్చుని అభ్యర్థులను నిర్ణయించలేరు. అలాగని ఎన్నికలు జరిగే సమయంలో పోలింగ్ కేంద్రాల వద్ద క్యాడర్‌బలంగానిలబడాలంటేజగన్‌స్వయంగా రంగంలోకి దిగి ముఖ్యమైన కార్యకర్తలతో సమావేశం కావాల్సి ఉంటుంది. కానీ వైసీపీ ఓటమి పాలయి రెండేళ్లవుతున్నా ఇప్పటి వరకూ అలాంటి చర్యలు తీసుకోలేదు. కొన్ని పర్యటనలకు వెళుతున్నా.. జనం, క్యాడర్ భారీగానే వస్తున్నప్పటికీ వారు ఎన్నికల సమయం ఉండేవరకూ జగన్ వారితో ముఖాముఖి మాట్లాడుకోవాల్సి ఉంటుంది. ఇలాంటి పనులను కూడా చేపట్టకపోతే కార్యకర్తలు పోలింగ్ కేంద్రాల వద్ద నిలబడటానికి కూడా రారు. జగన్ ఇప్పటికైనా మేలుకుంటే మంచిదన్న సూచనలు సీనియర్ నేతల నుంచి వినిపిస్తున్నాయి.

## నేడు ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవం

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

కంప్యూటర్ మరియు ఎలక్ట్రానిక్ పరికరాల గురించి అవగాహన పెంచడం ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. దిల్లీకి చెందిన రాజేంద్ర ఎస్.పవార్, విజయ్ కె.తడని లు ఐఐటి ఢిల్లీ లో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. 1981 లోనే రానున్న కాలంలో కంప్యూటర్లే ప్రపంచాన్ని శాసిస్తాయనే విషయాన్ని గుర్తించి...కంప్యూటర్ వినియోగం నేర్పించేందుకు ఎన్ఐఐటి (నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) అనే సంస్థను నెలకొల్పారు. 1981 డిసెంబర్ 2న డిల్లీలోనే మొదటి శాఖను ప్రారంభించారు.దీని ద్వారా విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ నివ్వటం ప్రారంభించారు. 2000 నాటికి ప్రపంచంలోని 40 దేశాల్లో రెండు వేల శాఖలు విస్తరించారు. 2001లో ఎన్ఐఐటి తన 20వ వార్షికోత్సవం సందర్భంగా ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవాన్ని ప్రారంభించింది.ఈ క్రమంలో 2001 డిసెంబరు 2న ఒకే రోజు ప్రపంచ వ్యాప్తంగా లక్ష మందికి కంప్యూటర్ శిక్షణనిచ్చారు. అదే రోజును ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవంగా ప్రపంచం గుర్తించింది.

# ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సేవా సమర్పణతో మెడికల్ కిట్ల పంపిణీ

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 01-ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నంద్యాల ఎస్సార్ బీసీ కాలనీ హెచ్ఐవి పరివర్తన లైఫ్ సెంటర్‌లో సేవా కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ అబ్రహం లింకన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎమ్‌డి ఫయాజ్, క్లస్టర్ ఇంచార్జ్ గోవింద్ నాయుడు, వైయస్సార్ నగర్ 38వ వార్డు టిడిపి ఇన్చార్జ్ దేరెడ్డి శివనాగిరెడ్డి, పార్టీ నాయకులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు హాజరయ్యారు.దాతల సహకారంతో లబ్ధిదారులకు మెడికల్ కిట్లు, బెడ్ షీట్లు పంపిణీ చేశారు. పంపిణీ కార్యక్రమంలో ఎన్ఎమ్‌డి ఫయాజ్, ప్రిన్సిపల్ అబ్రహం లింకన్, గోవింద్ నాయుడు, దేరెడ్డి శివనాగిరెడ్డి పాల్గొన్నారు.ఎన్ఎమ్‌డి ఫయాజ్ మాట్లాడుతూ--ఎయిడ్స్ బాధితుల పట్ల సమాజం అంగీకార భావాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. రోగులను అర్థం చేసుకోవడం, వారికి ధైర్యం చెప్పడం, వైద్యం అందించడంలో ప్రభుత్వం తో పాటు ప్రతి వ్యక్తి ముందుకు రావాలని







పిలుపునిచ్చారు. సేవా కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.దేరెడ్డి శివనాగిరెడ్డి మాట్లాడుతూ--హెచ్ఐవి బాధితుల కోసం తీసుకుంటున్న సేవా చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు. సామాజిక బాధ్యతతో ముందుకు వస్తున్న దాతలు, సేవా సంస్థలను ప్రోత్సహిస్తూ ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. బాధిత కుటుంబాలకు అండగా నిలవడం పార్టీ నిబద్ధత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్యులకు న్యాయం చేయాలి

## బిల్డర్ పబ్బతి వేణు అరాచకాలు ఆపాలి:సిపిఐ నాయకుల డిమాండ్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 01- :స్వాతంత్ర సమరయోధుడు తాళ్లపల్లె వీరయ్య కుటుంబానికి జరుగుతున్న అన్యాయాన్ని ఆపి వెంటనే న్యాయం చేయాలని సిపిఐ పార్టీ భారీగా డిమాండ్ చేసింది. బాల్కొండ హాల్ వద్ద కుటుంబ ఆస్తులను ఫోర్జరీ సంతకాలతో ఆక్రమించి 5 అంతస్తుల భవనం నిర్మిస్తున్న బిల్డర్ పబ్బతి వేణు నిర్మాణాలను తక్షణం నిలిపివేయాలని పార్టీ నాయకులు కోరారు.సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు ఆధ్వర్యంలో తాళ్లపల్లె వీరయ్య కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కుటుంబ సభ్యులు బి. భాగ్యలక్ష్మి, జి. జయలక్ష్మి, ఇ. సరస్వతి, టి. అనసూయ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.సిపిఐ నాయకులు మాట్లాడుతూ?బిల్డర్ పబ్బతి వేణు ఫోర్జరీ పత్రాలతో ప్రభుత్వ శాఖలను తప్పుదారి పట్టించి నిర్మాణాలు చేపడుతున్నారని, గతంలో మహానంది దేవస్థానం భూములపైనా ఇలాంటి అక్రమాలు చేశారని ఆరోపించారు. మంత్రి పేరు చెప్పుకుని అధికారులను ఒత్తిడి చేయడం, ప్రభుత్వ స్థలాలను వినియోగించుకోవడం ప్రజాస్వామ్యంపై దాడి అని విమర్శించారు.తాళ్లపల్లె వీరయ్య కుటుంబానికి న్యాయం అయ్యే వరకు సిపిఐ అండగా ఉంటుందని నాయకులు స్పష్టం చేశారు. ధర్నాలో వందలాది మహిళలు, పార్టీ నాయకులు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్‌కు వివరాలు అందించగా, వెంటనే రిజిస్ట్రార్ మరియు మున్సిపల్ అధికారులతో సమగ్ర విచారణ జరిపి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

# కుక్కల బెడద బీభత్సం

## నత్తనడకన కూనీ ఆపరేషన్లు






విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 01-నంద్యాల పట్టణం అంతా కుక్కల బెడదతో అల్లకల్లోలంగా మారిపోయింది. ప్రధాన రహదారులు, కాలనీలు, మార్కెట్లు, సర్కిల్ దగ్గర ? ఎక్కడ చూసినా రెండు మూడు చొప్పున గుంపులుగా తిరుగుతున్న కుక్కలు ప్రజలపై దాడి చేసే స్థాయికి చేరడం భయాందోళనకు గురిచేస్తోంది. చిన్న పిల్లలు, పెద్దలు కూడా రాత్రివేళ బయటకు రావడానికి భయపడుతున్న స్థితి ఏర్పడింది. ఈ పరిస్థితిలో కుక్కల కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు మున్సిపాలిటీ వద్ద నత్తనడకన సాగుతున్నాయనే ఆరోపణలు మరింత బలే పడుతున్నాయి.పది రోజులు  డాక్టర్ కు జ్వరం కారణంగా ఆపరేషన్లు పూర్తిగా నిలిచిపోవడం ప్రజల్లో తీవ్రమైన ఆగ్రహం రగులుతోంది. పట్టణ ప్రాణానికి సంబంధించిన ఈ కీలకమైన కార్యక్రమానికి వెంటనే ప్రత్యామ్నాయ సిబ్బందిని నియమించకపోవడం మున్సిపాలిటీ నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు అంటున్నారు.మున్సిపల్ అధికారులు ఏదైనా ప్రశ్నిస్తే ?"కాంట్రాక్టర్‌కు అప్పగించాం? మాకు సంబంధం లేదు"అనే సమాధానం చెప్పేస్తున్నారని ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు. అధికారుల ఈ వ్యవహార శైలి కారణంగానే కుక్కల సంఖ్య అదుపు తప్పి పట్టణంలో ప్రమాదకర పరిస్థితి నెలకొన్నదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.అదే సమయంలో కాంట్రాక్టర్ పని ఎలా జరుగుతోంది, ఎన్ని కుక్కలను పట్టుకున్నారు, ఎన్ని ఆపరేషన్లు చేశారు అనే వివరాలపై అధికారులకు స్పష్టత లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజల ప్రాణాలకు సంబంధించి మున్సిపాలిటీ ఇంత నిర్లక్ష్యం ప్రదర్శించడం ఆశ్చర్యకరమని పలువురు ప్రశ్నిస్తున్నారు.పట్టణంలో కుక్కల దాడులు పెరుగుతున్న నేపథ్యంలో, కూనీ ఆపరేషన్లు కు తక్షణమే అదనపు వైద్య సిబ్బందిని నియమించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కుక్కల బెడద నియంత్రణలో మున్సిపాలిటీ బాధ్యతను తప్పించుకోలేదని, పట్టణ ప్రజల భద్రత కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# మున్సిపల్లో ప్రజా సమస్యల పరిష్కారం

## ప్రతి సోమవారం ప్రజావేదిక - సమస్యలకు తక్షణ స్పందన




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 01-నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా స్వీకరించి పరిష్కరించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు రెవెన్యూ అధికారి వెంకటరెడ్డి తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని వేగంగా, నాణ్యంగా పరిష్కరించాలన్న లక్ష్యంతో మున్సిపాల్టీ పనిచేస్తోందని పేర్కొన్నారు.ప్రతి శాఖ అధికారి తప్పనిసరిగా ఈ వేదికకు హాజరై సమస్యలను స్వయంగా వింటున్నారని ఆయన చెప్పారు. నీటి సరఫరా, డ్రైనేజ్ సమస్యలు, చెత్త సేకరణ, రోడ్ల మరమ్మతులు, స్ట్రీట్ లైట్లు, పన్నులు? ప్రజలకు ఏ అంశంలో సమస్య ఉన్నా నేరుగా వేదిక వద్దకు వచ్చి వినతి ఇచ్చేందుకు మున్సిపాల్టీ పిలుపునిచ్చింది.ప్రజలు వెనుకాడాల్సిన అవసరం లేదని, నిస్సంకోచంగా తమ సమస్యలను వేదిక వద్ద తెలపాలని వెంకటరెడ్డి అభ్యర్థించారు. "ఇది మీ ప్రజా వేదిక? ప్రతి సేవ ప్రజల చెంతకు చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యం" అని స్పష్టం చేశారు.ఈ వేదికలో పరిష్కరించలేని క్లిష్ట అంశాలను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజా వేదికకు పంపే విధానం అమలులో ఉందని తెలిపారు. ప్రతి సచివాలయం సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మేనేజర్ శిల్పా, సీనియర్ అసిస్టెంట్ నాగ బ్రహ్మం, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ విక్రమ్, జిలానీ బాషా, ఛరణ్‌తో పాటు మున్సిపల్ అధికారులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో వృద్ధుల ఆనందం

## భీమవరం అభివృద్ధికి నూతన బాటలు:మంత్రి ఎన్.ఎమ్.డి. ఫరూక్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 01:నంద్యాల మండలంలోని భీమవరం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పథకం కింద పింఛన్ల పంపిణీని రాష్ట్ర న్యాయశాఖ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎమ్.డి. ఫరూక్ ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గారితో కలిసి లబ్ధిదారుల గృహాలకు స్వయంగా వెళ్లి పింఛన్లు అందజేశారు. సంక్షేమం ప్రజల ఇంటి వద్దకే చేరాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి నెల 1వ తేదీన పింఛన్లు అందేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోందని మంత్రి తెలిపారు. వృద్ధులు, విధవులు, వికలాంగుల ముఖాల్లో కనిపిస్తున్న ఆనందమే ఈ పథకం విజయానికి నిదర్శనమన్నారు.లబ్ధిదారులను కలెక్టర్ జి. రాజకుమారి ప్రత్యక్షంగా అడిగి వారి సమస్యలను తెలుసుకున్నారు. పింఛన్ దరఖాస్తు పెండింగ్‌లో ఉందంటూ విన్నవించిన ఒక మానసిక వికలాంగుడి పత్రాలను స్వీకరించి, వెంటనే పరిష్కార చర్యలను తీసుకుంటామని హామీ ఇచ్చారు. పింఛన్ అనేది ప్రజలకు కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు, వేలాది కుటుంబాలకు జీవనాధారమని ఆమె పేర్కొన్నారు.పెన్షన్ పంపిణీ అనంతరం మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి భీమవరం గ్రామంలో 40 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సరికొత్త గ్రామ సచివాలయ భవనాన్ని, 7 లక్షల రూపాయల ఖర్చుతో పూర్తి చేసిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ప్రజలకు సేవలు మరింత చేరువ కానందుకు ఈ సచివాలయం కీలక మద్దతు అందిస్తుందని మంత్రి తెలిపారు. గ్రామ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అవసరమని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో విశ్వనాథ్, ఎమ్మార్వో, ఎంపీడీఓ, ప్రజాప్రతినిధులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

# పుల్లయ్య హత్య కేసు అసలు నిజాలు నలుగురు అరెస్టు

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 01-నంద్యాల పట్టణానికి చెందిన వేదరి పుల్లయ్య కనిపించకపోవడం పై విచారణ ప్రారంభించిన పోలీసులు కేసు లోని అసలు విషయాలను వెలికితీసి నలుగురు నిందితులను అరెస్ట చేశారు. కత్తి, రెండు డీవీఆర్‌లు, ల్యాప్‌టాప్, పత్రాలు స్వాధీనం చేశారు.15 నవంబరు నుండి పుల్లయ్య ఫోన్ అందుబాటులో లేకపోవడంతో కుమారుడు 19 నవంబరు న మూడు టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. 29 నవంబరు న కుందూ నదిలో పుల్లయ్య మృతదేహం కనిపించడంతో కేసును హత్య కేసుగా మార్చారు. దర్యాప్తులో నిందితుడు ధనుంజయకు మృతునితో ముందే పరిచయం ఉ




ందని, అతని ఆస్తుల మీద కన్నేసి హత్య పథకం వేసిన విషయం బయటపడింది. 14 నవంబరు రాత్రి బోలెరో వాహనంలో తీసుకెళ్లి డబ్బులు అడగగా నిరాకరించడంతో తాడు బిగించి, తలకు కోసి పుల్లయ్యను నలుగురు కలిసి హత్య చేసినట్లు తెలుస్తోంది. అనంతరం శవాన్ని కుందూ నదిలో పడేసి, ఇంటిలోని డీవీఆర్‌లు, ల్యాప్‌టాప్, పత్రాలు తీసుకెళ్లి వివిధ ప్రదేశాల్లో పారేశారు.పోలీసులు ప్రజలకు అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని, అనుమానం కలిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# వైస్ ఆర్ నగర్‌లో పెన్షన్‌ల పంపిణీ

## శివనాగిరెడ్డి చేతుల మీదుగా పెన్షన్‌లు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్01-నంద్యాల జిల్లా కేంద్రం లోని వైస్ ఆర్ నగర్‌లో సోమవారం ఎన్టీఆర్‌భరోసాపెన్షన్‌లపంపిణీ కార్య క్రమం ఘనంగా జరిగింది. టీడీపీ పార్టీ ఇన్‌చార్జ్ దేరెడ్డి శివనాగిరెడ్డి పింఛన్‌దారులకు స్వయంగా పెన్షన్ లు అందజేశారు.ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ? ఎన్టీఆర్ భరోసా పథకంరాష్ట్రంలోవృద్ధులకు, వికలాంగు లకు, విధవలకు, నిరుపేదలకు నిజంగా ఆశ్రయంగా మారిందని పేర్కొన్నారు."ప్రతిపింఛన్‌మీభరోసా?ప్రతిరూపాయి మీ అండ? ప్రజల జీవితాల్లో కొంత వెలుగు నింపటానికి ఈ పథకం ఎంతో దోహదపడు తోంది" అని తెలిపారు.ప్రజల సమస్యలు వింటూ వెంటనే పరిష్కరించడం తన మొదటి కర్తవ్యమని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరేటట్లు చూడడం టీడీపీ శ్రేణుల బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రజలు చేసే ప్రతి విజ్ఞప్తి తమకు ఆదేశమని, ఎప్పుడూ ప్రజల కోసం అందుబాటులో ఉంటామని ఆయన హామీ ఇచ్చారు.కార్య క్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు,అభిమానులు,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంచేశారు. ప్రాంతంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.

# ఘనంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ...

విభారె న్యూస్ డోన్ మా ప్రతినిధి:-డిసెంబర్ 1 డోన్ మండల పరిధి లోని దొరపల్లి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్  పంపిణీ కార్యక్రమంలో డోన్ శాసనసభ్యులు  కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి  పాల్గొన్నారు. ఈ ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం వల్ల వృద్ధులు, వికలాంగులు, నిరుపేదలు ఆర్థికంగా కొంత ఊరట పొందుతున్నారని తెలిపారు.ప్రతి పింఛన్ మీ భరోసా,ప్రతి రూపాయి మీ అండ,అని ఎమ్మెల్యే తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ప్రతి ఇంటికి చేరవేయడం తమ బాధ్యతగా భావిస్తున్నామని, ప్రజల సమస్యలు తీర్చడంలో ఎప్పుడూ ముందుంటామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో టిడిపి నాయకులు వలసల రామకృష్ణ, శేషఫణి గౌడ్ దొరకపల్లి గ్రామ నాయకులు బాల చంద్రశేఖర్ యాదవ్, సతీష్ గౌడ్, మల్లికార్జున, గోపాల్ యాదవ్, శ్రీనివాసులు,కొండన్న కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు



# ఆదోని జిల్లాగా ప్రకటించాలని నిరసనదారులకు సంపూర్ణ మద్దతు..



విభారే న్యూస్ డిసెంబర్ 1 ఎమ్మిగనూరు..కర్నూలు పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గల వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు నమస్కారం.ఆదోని పట్టణాన్ని ఆదోని జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ,అఖిలపక్ష ఆదోని జిల్లా సాధన జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసన నిరాహార దీక్షలకు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుచున్నది.ఈ నేపథ్యంలో, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్త శ్రీమతి బుట్టా రేణుక,వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగ ఉపాధ్యక్షులు బుట్టా ప్రతుల్,పార్టీ సీనియర్ నాయకులు  బుట్టా శివ నీలకంఠ గౌరవప్రదంగా తమ మద్దతును తెలియజేయడానికి 02 డిసెంబర్ 2025, ఉదయం 9:00 గంటలకు ఎమ్మిగనూరు పట్టణంలోని పార్లమెంట్ సమన్వయకర్త కార్యాలయం నుండి బయలుదేరి, ఆదోని పట్టణంలోని కోట్ల సర్కిల్ వద్ద చేరుకోనున్నారు. అక్కడ నిరసనకారులతో ఐక్యత వ్యక్తం చేసిన అనంతరం, శాంతియుతంగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని, ఆదోని జిల్లాగా ప్రకటించాలనే డిమాండ్‌తో కూడిన వినతి పత్రాన్ని సమర్పించనున్నారు.అంతేకాక, కర్నూలు పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గల ప్రతి మండల /పట్టణ, ప్రతి గ్రామం, ప్రతి వార్డు నుండి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎంపీపీలు, జడ్పిటిసిలు, ఎంపీటీసీలు, సర్పంచులు, మున్సిపల్ చైర్మన్లు, మున్సిపల్ వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వార్డు ఇన్చార్జీలు, మాజీ కౌన్సిలర్లు,రాష్ట్ర-జిల్లా-నియోజకవర్గ- మండల-పట్టణ-గ్రామ స్థాయి పార్టీ కమిటీ సభ్యులు, అనుభందం విభాగల కమిటీ సభ్యులు అలాగే ప్రజలు, అభిమానులు అందరూ భారీ సంఖ్యలో పాల్గొని, ఆదోని జిల్లా సాధనకు తమ మద్దతును తెలియజేయవలసిందిగా మనవి.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**